న్యూస్ బాక్స్

నేడు సర్వసభ్య సమావేశం



కర్నూలు, న్యూసిటీ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): సుంకేసుల రోడ్డులోని ఎస్‌బీఐ కాలనీ కౌన్సిల్ హాలులో శుక్రవారం నగర పాలక సంస్థ సర్వసభ్య సమావేశం జరగనుంది. సమావేశానికి మేయర్ బీవై రామయ్య అధ్యక్షత వహించనున్నారు. మంత్రి టీజీ భరత్‌తోపాటు కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, పాణ్యం, కోడుమూరు ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, బొగ్గుల దస్తగిరి, కమిషనర్ ఎస్.రవీంద్రబాబు హాజరు కానున్నారు. కూటమి ప్రభుత్వ ఏర్పాటయ్యాక జరుగుతున్న రెండో కౌన్సిల్ సమావేశం ఇది. పరిష్కారానికి నోచుకోని సమస్యలపై సభ్యులు ఏమాత్రం గళమెత్తుతారో చూడాలి మరి.

డీఈఓగా శ్యామ్యూల్ పాల్



కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా విద్యాశాఖ అధికారి(డీఈఓ)గా ఎస్.శ్యామ్యూల్ పాల్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి కోన శశిధర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వానికి రిపోర్టు చేసుకోవాలని ఇక్కడ పని చేస్తున్న డీఈవో శ్యామ్యూల్ పాల్‌కు ఆదేశాలు జారీ చేశారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్యామ్యూల్ పాల్‌ను రెగ్యులర్ డీఈఓగా నియమించారు. ఈ సందర్భంగా కార్యాలయ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

నంద్యాలకు జనార్దన రెడ్డి

నంద్యాల జిల్లా విద్యాశాఖ అధికారిగా జనార్దనరెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. గురువారం రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. కర్నూలులోని డైట్ కళాశాలలో సీనియర్ అధ్యాపకుడిగా విధులు నిర్వర్తిస్తున్న జనార్దనరెడ్డికి నంద్యాల జిల్లా డీఈవోగా పూర్తి స్థాయి బాధ్యతలను అప్పగించింది. గతంలో డీఈవోగా పని చేసిన సుధాకర్‌రెడ్డిని ఎఫ్‌ఏసీ విధుల నుంచి తొలగించి గతంలో డోన్ డిప్యూటీ ఈవోగా పని చేసిన స్థానానికి బదిలీ చేశారు.

డీఆర్వోగా వెంకట నారాయణమ్మ



కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా డీఆర్వోగా వెంకట నారాయణమ్మ నియమితుల య్యారు. ప్రస్తుతం ఆమె శ్రీశైలం స్పెషల్ కలెక్టర్‌గా పని చేస్తున్నారు. ఇక్కడ పని చేసిన డీఆర్వో మధుసూదన్‌రావు అన్నమయ్య జిల్లాకు బదిలీ అయ్యారు. కొత్త డీఆర్వో వెంకటనారాయణమ్మ రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు.


బీఈడీ పరీక్షల పరిశీలన

కర్నూలు అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఇన్‌చార్జి ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ అధికారులను ఆదేశించారు. గురువారం నగరంలోని వివిధ కళాశాలల్లో జరుగుతున్న పరీక్షల తీరును ఆయన పరిశీలించారు.

ఆయన

ఆనాటి ఎమ్మెల్యే ఆత్మ

రాజకీయ అండతో అనేక అక్రమాలు



ఆదోని మున్సిపాలిటీ అధికారులు 14వ ఆర్థిక సంఘం నిధులతో సీసీ డ్రైనేజీ నిర్మాణానికి కాంట్రాక్టరు ద్వారా ఒప్పందం చేసుకున్న నిజామోద్దీన్‌కాలనీ ప్రధాన రోడ్డు ఇది. ఈ వీధిలోనే సీసీ డ్రైనేజీ నిర్మించాల్సి ఉంది.

- గత వైసీపీ ప్రభుత్వంలో ఓ కాంట్రాక్టర్ ఇష్టారాజ్యం
- బ్లాక్ లిస్టులో పెట్టాలని సీడీఎంఏ ఆదేశాలు
- ఉత్తర్వులు బేఖాతర్.. ఆ కాంట్రాక్టరుకే మళ్లీ పనులు

కర్నూలు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో ఆ కాంట్రాక్టరు పేరు చెబితే అధికారులకు హడల్. నాటి ఎమ్మెల్యే వై. సాయిప్రసాద్‌రెడ్డిని సాయి అని పేరు పెట్టి పిలవగలిగేంతటి సాన్నిత్యం ఆయనకు ఉంది. ఆ చనువుతో ఇష్టారాజ్యంగా చెలరేగిపోయారు. ఇంజనీర్లతో సంబంధం లేదు.. ఒప్పందాలను పట్టించుకోవాల్సిన పని లేదు. తాను ఏ పని చేస్తే అదే ఒప్పందంగా రికార్డు చేయాల్సిందే. లేదంటే నాటి ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి నుంచి ఫోన్లు వచ్చేవి. నిరుపేదలు నివసించే నిజామోద్దీన్ కాలనీలో సీసీ డ్రైనేజీ నిర్మాణానికి అధికారులు నిధులు మంజూరు చేశారు. మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం చేసింది. ఆ పని చేస్తే లాభం రాదనో.. మరే ఇతర కారణమో.. ఆ కాంట్రాక్టరుకే ఎరుక. సీసీ డ్రైనేజీ నిర్మాణం చేయకపోగా ఎలాంటి అనుమతులు లేకుండా మరో ప్రాంతంలో బీటీ రోడ్డు వేశారు. దీనిపై ఇంజనీర్లపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటూ.. కాంట్రాక్టరును 'బ్లాక్ లిస్ట్'లో పెట్టేందుకు సమగ్ర నివేదిక పంపాలని మున్సిపాలిటీ శాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ) రీజినల్ డైరెక్టర్ (ఆర్‌డీ)ని ఆదేశించారు. రాజకీయ అండతో అదే కాంట్రాక్టరుకు రూ.కోట్ల విలువైన పనులు ఇవ్వడం విమర్శలకు తావిస్తున్నది.

మిగతా 6లో..



కాంట్రాక్టర్, మున్సిపల్ ఇంజనీర్లపై చర్యలు తీసుకోవాలనిఆర్‌డీకి సీడీఎంఏ రాసిన లేఖ

ఆదోని మున్సిపాలిటీ పరిధిలో గత వైసీపీ ప్రభుత్వంలో 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.కోట్ల విలువైన సీసీ డ్రైనేజీలు, సీసీ రోడ్లు, తాగునీటి పైపులైన్లు నిర్మించడం వంటి పనులు చేపట్టారు. ఈ పనులు మెజార్టీగా నాటి వైసీపీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఆత్మగా పిలవబడే ఆయన అత్యంత సన్నిహితుడైన ఓ కాంట్రాక్టరు చేశారు. 14వ ఆర్థిక సంఘం నిధుల్లో భాగంగా నిజామొద్దీన్ కాలనీ వార్డు నంబరు ఇంటి నుంచి 5/633/1 నుంచి ఇంటి నంబరు 5/660 వరకు సీసీ డ్రైనేజీ నిర్మాణానికి రూ.18.79 లక్షలతో మున్సిపల్ ఇంజనీర్లు టెండర్లు పిలిచారు. ఆ పనుల్ని నాటి వైసీపీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అత్యంత సన్నిహిత కాంట్రాక్టరు దక్కించుకున్నారు. 2022 మార్చి 21న మున్సిపల్ ఇంజనీర్లతో ఒప్పందం చేసుకున్నారు. అయితే.. నిబంధనలను తుంగలో తొక్కి సీసీ డ్రైనేజీ నిర్మాణం చేయకుండా అదే కాలనీలో మరో వీధిలో బీటీ రోడ్డు (తారు రోడ్డు) నిర్మించారని మున్సిపల్ అధికారులు పేర్కొంటున్నారు. టెండరు ఒప్పందం నిబంధనలు ప్రకారం పనులు చేయించాల్సిన ఇంజనీర్లు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి కళ్లకు గంతలు కట్టుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

2 నుంచి కార్తీక మాసోత్సవాలు

15న మహానందిలో కోటి దీపోత్సవం

29న మహానందీశ్వరునికి లక్ష బిల్వార్చన



మహానందిలో మాట్లాడుతున్న ఈవో శ్రీనివాసరెడ్డి

మహానంది, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో నవంబరు 2 నుంచి డిసెంబరు 1 వరకు కార్తీక మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం దేవస్థానం పరిపాలన భవనంలో కార్తీక మాసోత్సవాల ఏర్పాట్ల గురించి వివరించారు. గత ఏడాదికంటే ఈ ఏడాది మహానంది క్షేత్రంలో కార్తీక మాసోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా శని, ఆది, సోమవారాల్లో తెల్లవారుజామున 3 గంటల నుంచి ఆలయంలో ప్రాతఃకాల పూజలు నిర్వహించడంతోపాటు 3.30 గంటలకు మహా మంగళ హారతుల సేవలను జరుపుతా మన్నారు. 4 గంటల నుంచి సాధారణ దర్శనంతోపాటు కోనేర్లలో కార్తీక స్నానాలు చేసుకు నేందుకు భక్తులకు అనుమతి స్తామన్నారు. క్యూలో ఉండే భక్తులకు ఉచితంగా పాలు, మంచినీటి బాటిళ్లు అందిస్తామని తెలిపారు. అలాగే ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో సామూహిక అభిషేకాలు నిర్వహించుకునే ఏర్పాట్లు చేశామన్నారు. కార్తీక మాసోత్సవంలో పరోక్ష రుద్రాక్ష సేవలో భాగంగా రూ.2 వేలు చెల్లించే భక్తులకు ఒక్క రోజు స్పర్శ దర్శనం కల్పిస్తామన్నారు. నవంబరు 15న కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని క్షేత్రంలో కోటి దీపోత్సవం, జ్వాలా తోరణం జరుపుతామన్నారు. 29న మాస శివరాత్రి పురస్కరించుకొని ప్రధాన గర్భాలయంలో లక్ష బిల్వార్చన, 30న కామేశ్వరీదేవి అమ్మవారికి లక్ష కుంకుమార్చనతోపాటు శాంతి కల్యాణం నిర్వహించడంతో మహానందిలో కార్తీక మాసోత్సవాలు ముగుస్తాయని ఈవో తెలిపారు. కార్యక్రమంలో ఆలయ వేదపండితులు రవిశంకర్ అవధాని, ప్రధాన అర్చకులు అర్జునశర్మ, జనార్దన్‌శర్మ, రాజమాణిక్యశర్మతో పాటు ఏఈఓ ఎర్రమల్ల మధు, పర్యవేక్షకులు శశిధర్‌రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ఆర్ఎస్ శ్రీనివాసులు, శానిటేషన్ ఇన్‌చార్జి పసుపుల సుబ్బారెడ్డిలు పాల్గొన్నారు.

హత్య కేసులో

ఇద్దరికి జీవిత ఖైదు

రూ.వెయ్యి చొప్పున జరిమానా

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి) : శిరివెళ్ల మండలం కోటపాడు గ్రామంలో జరిగిన ఓ హత్య కేసులో ఆళ్లగడ్డ న్యాయస్థానం గురువారం ఇద్దరికి జీవిత ఖైదు విధించింది. శిరివెళ్ల ఎస్ఐ చిన్న పీరయ్య వివరాల మేరకు.. కోటపాడుకు చెందిన షేక్ హుసేన్‌బీ తన కుమార్తెను ఆళ్లగడ్డ పట్టణంలోని రామదాసు వీధికి చెందిన షేక్ అహమ్మద్ హుసేన్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. అల్లుడు అహమ్మద్ హుసేన్ తన కుమార్తెను సరిగ్గా చూసుకోవడం లేదన్న కారణంతో హత్య చేసేందుకు హుసేన్‌బీ కుట్ర పన్నింది. ఈ మేరకు అదే గ్రామానికి చెందిన షేక్ హుసేన్‌వలితో కలిసి అల్లుడు అహమ్మద్ హుసేన్‌పై కోటపాడులో కిరోసిన్ పోసి నిప్పంటించింది. గాయాలపాలైన అహమ్మద్ హుసేన్ కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో శిరివెళ్ల పోలీస్ స్టేషన్‌లో 2019లో కేసు నమోదైంది. అనంతరం నిందితులను కోర్టులో హాజరు పర్చగా జడ్జి రిమాండుకు పంపించారు. గురువారం ఆళ్లగడ్డ న్యాయస్థానంలో వాదోపవాదాలు జరిగాయి. సాక్ష్యాలను పరిశీలించిన 5వ అదనపు జిల్లా జడ్జి వీవీఎస్ మురళీకృష్ణ షేక్ హుసేన్‌వలి, షేక్ హుసేన్‌బీలకు జీవిత ఖైదు, ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించారు.

మహావిరాళం

మహానంది క్షేత్రానికి రూ.2కోట్లు విలువైన భూమిని అప్పగించిన దాతలు 6

ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి 7

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి

యురేనియం తవ్వకాలు వద్దు 7

- కప్పట్రాళ్ల, బేతపల్లి గ్రామస్థుల నిరసన

ముహూర్తం సమయానికి కనిపించని వధువు... ఆగిన వివాహం 7లో

35 సీజనల్ హాస్టళ్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 12 మండలాల్లో 35 సీజనల్ హాస్టళ్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపారు. జిల్లాలో వివిధ గ్రామాల్లో చిన్న, సన్నకారు రైతులతోపాటు వ్యవసాయ కూలి పనులు చేసుకొని జీవనం సాగించే కుటుంబాలు ఇతర ప్రాంతాలకు వలసలకు వెళ్తుంటాయి. ఈ క్రమంలోనే తమ పిల్లలను సైతం వారి వెంట తీసుకెళ్తున్నాయి. దీంతో విద్యార్థుల గైర్హాజర్ శాతం పెరుగుతోంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఆయా గ్రామాల్లో సీజనల్ వసతి గృహాలను ఏర్పాటు చేసి పిల్లలు రెగ్యులర్‌గా పాఠశాలలకు హాజరైందుకు చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా కర్నూలు జిల్లాలోని ఆదోని మండలంలో పెద్దహరివనం, హాలహర్వి మండలంలో నెట్రవట్టి, హొళగుంద మండలంలో హొళగుందలో-2, కోడుమూరులోని కలపరి, కోస్గి మండలంలో కందుకూరు, కోస్గి-3, కౌతాళం మండలంలో ఎరిగెరి, కౌతాళం, కత్రికి, క్రిష్ణగిరి మండలంలోని కంబాలపాడు-2, కోయిలకొండో-2, చిట్యాల-1, మంత్రాలయం మండలంలో బుదూరు, రచ్చుమర్రి, మాధవరం, నందవరం మండలంలోని చిన్నకొత్తిలి, పత్తికొండ మండలంలో జూటూరు-2, దూడేకొండ-2, పందికోన, పుచ్చకాయల మాడ-2, పెద్దకడబూరు మండలంలోని కల్లుకుంట, తుగ్గలి మండలంలోని జి.ఎర్రగుడి-2, చెన్నంపల్లి, జొన్నగిరి-2, కోతికొండ, పగిడిరాయిలో వసతి గృహాలను ఏర్పాటు చేసేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

భారీగా ఉల్లి దిగుబడులు



రైతులు కర్నూలు మార్కెట్‌కు తీసుకొచ్చిన ఉల్లి దిగుబడులు

కర్నూలు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కర్నూలు వ్యయసాయ మార్కెట్‌కు గురువారం ఉల్లి దిగుబడులు పోటెత్తాయి. ఉమ్మడి కర్నూలుతో పాటు సరిహద్దు జిల్లాలు, కర్ణాటక నుంచి రైతులు ఉల్లి దిగుబడులు భారీ ఎత్తున తీసుకొస్తున్నారు. మార్కెట్ యార్డు మెయిన్ గేట్ వద్ద వివరాలు నమోదు చేసిన తరువాతే మార్కెట్‌లోకి అనుమతి ఇస్తున్నారు. ఈ ప్రక్రియ జాప్యం అవుతోంది. దీనికి తోడు ఇప్పటికే మార్కెట్‌లో దిగుబడి భారీగా ఉంది. ఈ కారణంగా ఆర్టీసీ బస్టాండ్ నుంచి మార్కెట్ ముందున్న అశోక్ నగర్ రోడ్డుపై వరకు ఉల్లి ట్రాక్టర్లు, లారీలు, ఎద్దుబండ్లు బారులుదీరాయి. కర్నూలు జిల్లాలో దాదాపు 25 వేల హెక్టార్లలో ఉల్లి సాగు చేశారు. ఎక్కువ రోజులు పొలంలో ఉంచితే పంట కుళ్లిపోతుంది. ఆలస్యమైతే ధర పతనమవుతుంది. ఈ భయంతో రైతులు భారీగా ఉల్లి తీసుకొస్తున్నారు. గురువారం కర్నూలు మార్కెట్‌కు 43,803 బస్తాల (19,711 క్వింటాళ్లు) దిగుబడులు వచ్చాయి. క్వింటా కనిష్ట ధర రూ.444, గరిష్ఠంగా రూ.4,639, మధ్యస్థంగా రూ.3,888 పలికింది.



బారులుదీరిన ఉల్లిగడ్డల వాహనాలు

కంఠమాడిస్తే.. కరతాళ ధ్వనులే..!

కళ



సత్యహరిశ్చంద్ర నాటకంలోని వేటశీను పాత్రలో గల్లా పిచ్చయ్య

- నాటక రంగంలో 41 ఏళ్లుగా విశేష సేవలు
- విభిన్న పాత్రల్లో ఆయన అభినయం అద్భుతం
- నాటక రంగంలో రాణిస్తున్న గల్లా పిచ్చయ్య

ఆత్మకూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అంతరించిపోతున్న నాటక రంగానికి జీవం పోస్తున్నారు. అనుకున్నంత ప్రోత్సాహం లేకపోయినా ప్రదర్శనలు మాత్రం అలాగే కొనసాగిస్తున్నారు. ఆత్మకూరు ప్రాంతానికి చెందిన గల్లా పిచ్చయ్య అనే కళాకారుడు నాటక రంగానికి విశేష సేవలు అందిస్తున్నారు. 41 ఏళ్లుగా అనేక పాత్రలు పోషిస్తూ వస్తున్న ఆయన తన ప్రతిభతో అందరి మెప్పు పొందుతున్నారు. వేదికపై గొంతెత్తితే సభికుల కరతాళ ధ్వనులే తప్పా.. మరేమి వినపడని విధంగా నాటక రంగంలో ప్రావీణ్యం సాధించారు. తెలుగు విద్వాన్ చదువుకున్న ఆయన తెలుగు భాషపై మమకారాన్ని పెంచుకొని నాటక రంగానికి ఆకర్షితులయ్యారు. భాషా ఉచ్చారణను మెరుగుపర్చుకునే క్రమంలో తెలుగు నాటక రంగంలోకి 1983లో తొలిసారిగా ఆయన ప్రవేశించారు. నాటి నుంచి వెనక్కి తిరిగి చూడకుండా నాటక రంగంలో రాణిస్తున్నారు. వివిధ ప్రాంతాల్లో నాటకాలు వేస్తూ తన విశేష ప్రతిభతో ప్రజల నుంచి ప్రశంసలు అందుకుంటున్నారు.



శ్రీకృష్ణ రాయబారం నాటకంలో..

నాటక రంగానికి ప్రభుత్వ తోడ్పాటు అవసరం



ఆదరణ తగ్గుతున్న నాటకరంగాన్ని భావితరాలకు తెలియజేసేందుకు గాను ప్రభుత్వం చొరవ తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నాటకరంగ కళాకారులకు ఆర్థిక తోడ్పాటునందించి ఆ రంగంలో విశేష సేవలందించిన వారందరికీ పింఛన్‌తోపాటు ఇతర రాయితీలు కల్పిస్తే.. కళాకారులు మరింత ఉత్సాహంతో తమ కళను మెరుగుపర్చుకునేందుకు అవకాశం ఉంటుంది. అంతేకాకుండా ప్రతిఏటా నాటక రంగ కళల పోటీలను నిర్వహించి కళాకారులకు ప్రోత్సాహం అందించాలి. అలాంటప్పుడే పదికాలల పాటు కళలు పదిలంగా ఉంటాయి.

- గల్లా పిచ్చయ్య, నాటక రంగ కళాకారుడు

ఆ పాత్రల్లో ఆయనే మేటి



నాటక రంగ ప్రదర్శనల్లో పలు పాత్రల్లో గల్లా పిచ్చయ్యకు ఆయనకు ఆయనే సాటి అని చెప్పవచ్చు. అద్భుతమైన వేషధారణతో ఆకట్టుకునే అభినయ ప్రదర్శనలు ఇవ్వడం ఆయన ప్రత్యేకత. శ్రీకృష్ణరాయబారం సన్నివేశంలోని కర్ణ రహస్యం భాగంలో శ్రీకృష్ణుడి పాత్రను సునాయసంగా ప్రదర్శిస్తారు ఆయన. అలాగే సత్యహరిశ్చంద్ర నాటికలో వేటశీను పాత్రను, రాజ్యాదానం భాగమందలి హరిచంద్రుని పాత్రను ఎంతో చక్కగా ప్రదర్శించి అనేక మంది ప్రముఖులచే ప్రశంసలు దక్కించుకున్నారు ఆయన. అంతేగాకుండా వారనాసిలో హరిచంద్రుని పాత్ర, చింతామణి నాటకంలో బిల్వమంగళుడి పాత్రల్లో అభినయం అనంతమని కీర్తి పొందారు. తెలుగు బాష పట్ల అభిరుచి కలిగి ఉండటం పట్ల నాటకంలో కంఠమెత్తితే గాత్రం భావయుక్తంగా, ఉచ్చారణదోషాలు లేకుండా స్పష్టమైన పదాల ఉత్పత్తి, హావభావాలు కలిగిన ప్రదర్శనతో నాటక రంగ ప్రేమికులను అలరించడంలో ఆయనది అందెవేసిన చేయి. ప్రత్యేకించి జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కృష్ణయ్యను గురువుగా భావించి ఏకలవ్యశిష్యుడిగా ఆయన తన ప్రదర్శనలను మెరుగుపర్చుకున్నారు. కాగా శ్రీశైలం, మహానంది, కర్నూలు, కొలనుభారతి, నంద్యాల తదితర ప్రాంతాల్లో అనేకంగా నాటక ప్రదర్శలు చేశారు. అంతేగాకుండా ఆత్మకూరు చుట్టు పక్కల ప్రాంతాల్లో కూడా ఈయన నటనకు మంచి ఆదరణే కనిపిస్తోంది.

వానలవేళ జాగ్రత్త..!

విద్యుత్ ప్రమాదాలపై ఏపీఎస్పీడీసీఎల్ అవగాహన కార్యక్రమాలు



కల్లూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : అవగాహన లేమి, నిర్లక్ష్యం కారణంగా ప్రజలు తరచూ విద్యుత్ ప్రమాదాలు జరిగి నిండు ప్రాణాలు కోల్పోతున్నారు. ఇలాంటి ప్రమాదాల నివారణకు ఎస్ఈ ఎం.ఉమాపతి ప్రత్యేక దృష్టి సారించారు. ప్రధానంగా వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు జరిగే ఆస్కారం అధికంగా ఉండటంతో ప్రజలను అప్రమత్తం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నారు. రద్దీ ప్రాంతాలు, పాఠశాలలు, పరిశ్రమలు, ప్రజల వద్దకు ప్రచార వాహనాలను తిప్పుతూ అవగాహన కల్పిస్తున్నారు. ప్రమాదాలు ఏవిధంగా సంభవిస్తాయనే విషయాలను తెలియపరిచే గోడపత్రికలను అతికిస్తున్నారు. పరిసర ప్రాంతాల్లో రహదారులపై విద్యుత్ తీగలు తెగిపడి ఉన్నా స్తంభాలు ఒరిగినా తగు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు ఏపీఎస్పీడీసీఎల్‌కు సమాచారం అందించడం వంటి విషయాలపై చైతన్యం కలిగిస్తున్నారు.

● 1912కు సమాచారం ఇవ్వండి

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే కాక ప్రమాదాలను అరికట్టేందుకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. తెగిపడి ఉన్న విద్యుత్ తీగలు, స్తంభాలను తాకుండా 1912 ద్వారా ఏపీఎస్పీడీసీఎల్‌కు సమాచారం అందిస్తే సిబ్బందిని అప్రమత్తం చేస్తాం. ముఖ్యంగా పొలాల్లో పని చేసే రైతులు పంపుసెట్ల వేసేటప్పుడు జరిగే ప్రమాదాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం.

- విద్యుత్‌శాఖ ఎస్ఈ ఎం.ఉమాపతి

మహావిరాళం

మహానంది క్షేత్రానికి రూ.2 కోట్ల విలువైన భూమి పత్రాల అప్పగింత



ఆలయ ఈఓకు రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేస్తున్న దాతలు

మహానంది, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మహానందీశ్వరుడికి రూ.2 కోట్ల విలువ చేసే భూమిని సమర్పించారు. మహానంది మండలం గోపవరం గ్రామానికి చెందిన రిటైర్డ్ అధ్యాపకుడు దొండపాటి రాజు, శకుంతల దంపతులు గ్రామంలో 5 సెంట్ల ఇంటి స్థలంతో పాటు 528 సర్వే నెంబర్‌లోని 2.10 ఎకరాల పొలాన్ని గురువారం మహానంది ఆలయానికి విరాళంగా ఇచ్చారు. ఇందుకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలను ఆలయ ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డికి దాతలు అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు మహానంది ఆలయ ముఖ మండపం వద్ద ఈఓ ఆధ్వర్యంలో అర్చకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో స్వామి, అమ్మవార్లకు అభిషేకార్చనలు జరిపారు. వేదపండితులు ఆశీర్వదించి, ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ ఎర్రమల్ల మధు, పర్యవేక్షకులు శశిధర్‌రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, నాగమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

దుగ్గు దుగ్గు.. తుక్కు తుక్కు



రోడ్డు రోలర్‌తో సైలెన్సర్ల ధ్వంసం



కర్నూలు క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నగరంలో కొండారెడ్డి బురుజు జిల్లా పోలీస్ కార్యాలయం వద్ద 110 బైక్ సైలెన్సర్లను పోలీసులు ధ్వంసం చేశారు. వారం రోజులుగా ట్రాఫిక్ పోలీసులు అధిక శబ్దాలు వచ్చే వాహనాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో 110 వాహనాల సైలెన్సర్లను తొలగించారు. వీటిని గురువారం ఉదయం జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆధ్వర్యంలో రోడ్డు రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. 80 డెసిబుల్స్ కంటే అధిక శబ్దాలు వచ్చే బైకులపై సైంటిఫిక్ పద్ధతుల్లో తనిఖీలు చేస్తున్నామని ఎస్పీ తెలిపారు. ఇలాంటి చర్యలు పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా కౌన్సెలింగ్ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ బాబు ప్రసాద్, సీఐలు మన్సూరుద్దీన్, నాగరాజురావు, రామయ్యనాయుడు, మురళీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆయన ఆనాటి ఎమ్మెల్యే ఆత్మ

- రాజకీయ అండతో అనేక అక్రమాలు
- గత వైసీపీ ప్రభుత్వంలో ఓ కాంట్రాక్టర్ ఇష్టారాజ్యం
- బ్లాక్ లిస్టులో పెట్టేలా చర్యలు తీసుకావాలని సీడీఎంఏ ఆదేశాలు
- ఉత్తర్వులను బేఖాతర్ చేస్తూ ఆ కాంట్రాక్టరుకే మళ్లీ పనులు

5వ పేజీ తరువాయి

ఎమ్మెల్యే అండదండలతో కౌన్సిల్ ఆమోదం, మున్సిపల్ శాఖ సీడీఎంఏ అప్రూవల్ లేకుండానే నిబంధలకు విరుద్ధంగా కాంట్రాక్టర్ సీసీ డ్రైనేజీ బదులుగా మరో ప్రాంతంలో బీటీ రోడ్డు వేయడమే కాకుండా.. బిల్లులు చెల్లించలేదంటూ మున్సిపాలిటీపై హైకోర్టుకు వెళ్లారని అధికారులే పేర్కొంటున్నారు. క్షేత్రస్థాయిలో విచారిస్తే.. టెండరు ఒప్పందం నిబంధనలు తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా పనులు చేశారని అధికారులు గుర్తించారు. దీంతో ఒప్పందం ప్రకారం నిజామొద్దీన్ కాలనీలో సీసీ డ్రైనేజీ నిర్మించలేదని వాస్తవ వివరాలతో మున్సిపల్ అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపించారు. ఈ నివేదిక ఆధారంగా నిబంధనలు ప్రకారం పనులు చేయించడంతో మున్సిపల్ ఇంజనీర్లు విఫలమైనందున ఏపీసీఎస్ ప్రకారం క్రమశిక్షణ చర్యలకు గురి అవుతారని, సీసీఏ రూల్స్ 1991 ప్రకారం సంబంధిత ఈఈ, డీఈఈ, ఏఈలపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ శాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ), పబ్లిక్ హెల్త్ విభాగం ఈఎన్‌సీని ప్రభుత్వం ఆదేశించింది. అదే క్రమం ఒప్పంద నిబంధనలు ఉల్లఘించిన కాంట్రాక్టరును బ్లాక్ లిస్టులో చేర్చాలని, అందుకు తీసుకున్న చర్యల నివేదికను తక్షణమే అందజేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో సంబంధిత ఇంజనీర్లకు చార్జ్ మెమోలు జారీ చేయాలని, నిబంధనలు ఉల్లంఘించిన కాంట్రాక్టరును బ్లాక్ లిస్టులో పెట్టేలా చర్యలు తీసుకోవాలని ఎల్ఆర్ ఆర్‌ఓసీ నంబరు ఈ-2138965/2023/సీ1 కింద 2023 నవంబరు9న మున్సిపల్ శాఖ అనంతపురం రీజినల్ డైరెక్టరుకు సీడీఎంఏ ఆదేశాలు జారీ చేశారు. అయితే.. ఇందుకు విరుద్ధంగా సదరు కాంట్రాక్టరుపై చర్యలు తీసుకోకపోగా అప్పటి వైసీపీ సాయిప్రసాద్‌రెడ్డి పలుకుపబడితో రూ.కోట్ల విలువైన పనులు ఆ కాంట్రాక్టర్‌కే అప్పగించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తున్నాయి.

బీటీ రోడ్డు నిర్మాణం తరువాత కౌన్సిల్ ఆమోదం

ఒకసారి టెండరు పిలిచిన ఏ పనినైనా మార్పు చేయాలనుకుంటే ప్రతిపాదనలు సవరించాలి. కౌన్సిల్ ఆమోదం, సీడీఎంఏ అప్రూవల్ తీసుకున్న తరువాత మళ్లీ టెండర్లు పిలిచి కాంట్రాక్టరు అప్పగించాలి. ఇందుకు విరుద్ధంగా కౌన్సిల్ ఆమోదం, సీడీఎంఏ అప్రూవల్ లేకుండా కాంట్రాక్టరే ఇష్టారాజ్యంగా సీసీ డ్రైనేజీ బదులుగా బీటీ రోడ్డు వేయడం విమర్శలకు తావిస్తుంది. కాంట్రాక్టరు బ్లాక్ లిస్టులో పెట్టాలని సీడీఎంఏ 2023 నవంబరు 9న ఆదేశాలు జారీ చేస్తే.. సదరు కాంట్రాక్టరు, ఇంజనీర్లను రక్షించేందుకు ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి రంగంలో దిగారు. సీసీ డ్రైన్లు వేయాల్సిన వీధుల్లో లెక్కకు మంచి అక్రమణలు ఉండడడంతో డ్రైనేజీ నిర్మాణాలకు అనుకూలంగా లేనందున ఎమ్మెల్యే కొన్ని మార్పులతో ఆ పనులు పూర్తి చేయాలని ఆదేశించారని, డ్రైన్ల స్థానంలో బీటీ రోడ్డు వేయుటకు ఛైర్ పర్సన్ ముందస్తు అనుమతి మంజూరు చేశారు. ఛైర్ పర్సన్ తీసుకున్న అత్యవసర చర్యకు ఆమోదం కోసం కౌన్సిల్ అజెండాలో పెట్టారు. కౌన్సిల్ తీర్మానం నంబరు 497 కింద 2024 మార్చి 7న దీన్ని ఆమోదించారు. అంటే.. 2022 మార్చి 21న సీసీ డ్రైనేజీ నిర్మాణానికి ఒప్పందం చేసుకొని.. ఆ స్థానంలో బీటీ రోడ్డు నిర్మించారు. ఒప్పంద నిబంధనలకు విరుద్ధంగా పనులు చేసిన కాంట్రాక్టరును బ్లాక్ లిస్టులో పెట్టాలని, పర్యవేక్షించిన ఇంజనీర్లపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలంటూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన తరువాత ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి సిఫారసు మేరకు కౌన్సిల్ ఆమోదం తెలపడం చూస్తే వారిని రక్షించేందుకే కౌన్సిల్‌ను వాడుకున్నారని తెలుస్తున్నది. ఆదోని పట్టణంలో గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన వివిధ అభివృద్ధి పనులపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో సమగ్ర విచారణ చేయిస్తే భారీ అక్రమాలు వెలుగు చేసే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు. దీనిపై ఆదోని మున్సిపల్ కమిషనర్ కృష్ణ, మున్సిపల్ ఇంజనీరు (ఎంఈ) ఇంతియాజ్ అలీ వివరణ కోసం ఆంధ్రజ్యోతి ఫోన్లో ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.



మేకల బజారు నుంచి టీజీఎల్ కాలనీకి వెళ్లే రహదారిలో వేసిన బీటీ రోడ్డు

ప్రతి ఒక్కరికీ ఉపాధి చూపడమే లక్ష్యం

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- ఆన్‌లైన్ పోర్టల్‌లో ప్రతి నిరుద్యోగిని నమోదు చేయిస్తాం
- జిల్లా ఉపాధి కల్పనాధికారి పి.దీప్తి



కర్నూలు అర్బన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి చూపడమే లక్ష్యంగా పని చేస్తానని జిల్లా ఉపాధి కల్పనాధికారి, సెట్కూర్ సీఈవో పి. దీప్తి అన్నారు. మారుమూల ప్రాంతాల్లోని యువత సైతం ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకునేలా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తామన్నారు. గురువారం ఆమె 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

ప్రశ్న: యువతకు ఉపాధి కల్పించేందుకు ఎలాంటి ప్రణాళికతో వెళ్తున్నారు?

జవాబు: జిల్లా వ్యాప్తంగా మారుమూల గ్రామాల్లో సైతం పర్యటించి చదువు పూర్తి చేసుకున్న వారిని గుర్తిస్తాం. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ పోర్టల్‌లో (ఇండియా స్కాట్ యాక్సిస్ నేషనల్ కేరియర్ సర్వీసు పోర్టల్) ప్రతి నెలా వెయ్యి మంది నమోదు చేసుకునేలా వారికి అవగాహన కల్పిస్తాం. అందులో దేశంలో ఎక్కడెక్కడ వారి చదువుకు తగ్గట్టుగా ఉపాధి అవకాశాలు ఉన్నాయనేది తెలియజేసే విధంగా కార్యాచరణ రూపొందించాం. నిరంతరం వారికి సమాచారం ఆ పోర్టల్ ద్వారా అందుతుంది.

ప్ర: జాబ్ మేళాలు నిర్వహిస్తున్నారా?

జ: ఏపీఎస్ఎస్‌సీ, సీడాప్‌లతో కలిసి సంయుక్తంగా ప్రతి నెలా ఎనిమిది జాబ్ మేళాలు నిర్వహించి ప్రముఖ కంపెనీల ప్రతినిధులతో నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నాం. కంపెనీల్లో ఉపాధి అవకాశాలు కల్పించమే లక్ష్యంగా పని చేస్తాం. దీంతో పాటు ఇండియా స్కాట్ యాక్సిస్ నేషనల్ కేరియర్ సర్వీసు పోర్టల్ ద్వారా కూడా అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నాం.

ప్ర: నైపుణ్య అవకాశాలు ఎలా కల్పిస్తారు?

జ: ఇంటింటికి వెళ్లి నైపుణ్యాలను పసిగట్టి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు స్కిల్ సర్వే నిర్వహిస్తాం. ప్రస్తుతం మంగళగిరిలో జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని త్వరలో జిల్లాలో అమలు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. చదువుకున్న ప్రతి ఒక్కరికీ ఉపాధి అవకాశాలు కల్పించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఆ ప్రక్రియలో సిల్క్ సర్వే చేపడితే ప్రతి ఒక్కరూ ఉపాధి అవకాశాలు పొందే అవకాశం ఉంది.

ప్ర: ఒకేషనల్ గైడెన్స్ అంటే ?

జ: ఒకేషనల్ గైడెన్స్ ప్రోగ్రాం ద్వారా పది, ఇంటర్, ఐటీఐ చదువుతున్న కళాశాలల్లో డ్రాప్ అవుట్స్‌ను గుర్తించి వారికి అవగాహన కల్పించే కార్యక్రమం చేపట్టబోతున్నాం. అర్హతను బట్టి ఎలాంటి ఉపాధి ఉంది.. పైచదువులు చదివితే పొందే ఉపాధి అవకాశాలు ఎలా ఉండబోతాయనేది వివరిస్తాం. అవసరమైతే కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించి చదువు కొనసాగిస్తే ప్రయోజనాలపై వివరిస్తాం. చదువుకున్న ప్రతి ఒక్కరూ ఏదో ఒక ఉపాధి మార్గాన్ని ఎంచుకోవాలనేది మా లక్ష్యంగా పని చేస్తాం.

ప్ర: ఉపాధి కల్పనపై ఎలాంటి ప్రణాళికలు ఉన్నాయి..?

జ: నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే దానిపై ప్రత్యేక కార్యాచరణ ఉంది. అందుకు తగ్గట్టుగా ప్రోగ్రాం రూపొందించుకుంటున్నాం. చదువు తగ్గట్టుగా అవకాశాలు కల్పించేందుకు కంపెనీలతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతూ ముందస్తుగా ఇంటర్వ్యూలకు వేదికలు ఏర్పాటు చేస్తున్నాం. ప్రముఖ నేషనల్ కంపెనీలు కూడా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ముందుకు వస్తున్నాయి.

ప్రమాదకర స్థాయిలో తుంగభద్ర ప్రవాహం

మంత్రాలయం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర-కర్ణాటక రాష్ట్రాల సరిహద్దున ప్రవహిస్తున్న తుంగభద్ర నది ఉగ్రరూపం దాల్చింది. మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం వద్ద తుంగభద్ర నది వరద నీటితో పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తోంది. గురువారం సాయంత్రం మంత్రాలయం వద్ద 311.500 మీటర్ల నీటి మట్టంతో 1.11 లక్షల క్యూసెక్కుల నీరు ప్రవహించింది. టీబీ డ్యాం నుంచి 1.12 లక్షల క్యూసెక్కుల నీరు తుంగభద్ర నదికి విడుదల చేశారు. మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చి నదిలో పుణ్యస్నానాలు ఆచరించే భక్తులకు శ్రీమఠం అధికారులు మైకుల ద్వారా హెచ్చరికలు జారీ చేస్తున్నారు. తహసీల్దారు రవి, సీడబ్ల్యూసీ అధికారులు, మంత్రాలయం సీఐ రామాంజులు, ఎస్‌ఐలు పరమేష్ నాయక్, విజయ్ కుమార్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.



మంత్రాలయం వద్ద పరవళ్లు తొక్కుతున్న తుంగభద్ర

యురేనియం తవ్వకాలు జరపనివ్వం



నిరసన తెలుపుతున్న ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు

- కప్పట్రాళ్ల, బేతపల్లి గ్రామస్థుల నిరసన

దేవనకొండ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): యురేనియం తవ్వకాలను జరపనివ్వబోమని కప్పట్రాళ్ల, పి.కోటకొండ, బేతపల్లి గ్రామాలు ప్రజలు అన్నారు. గురువారం రిజర్వ్ ఫారెస్టులోని కౌలుట్ల చెన్నకేశవ ఆలయం వద్ద కప్పట్రాళ్ల సర్పంచు చెన్నమ నాయుడు, బేతపల్లి సర్పంచు మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. పచ్చటి పల్లెల్లో యురేనియం తవ్వకాల వార్తతో ప్రజల్లో అలజడి చెలరేగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. యురేనియం తవ్వకాలతో తమ ప్రాణాలతో ఆటలాడవద్దని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను వేడుకున్నారు. బోర్లు వేసేందుకు వస్తే తిరుగుబాటు చేస్తామని హెచ్చరించారు. టీడీపీ నాయకులు చింతమాను మల్లికార్జున, రంగడు, వైసీపీ నాయకులు రామచంద్ర పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి



ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న సేవాధికార సంస్థ కార్యదర్శి

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మంచి మార్గంలో నడిస్తే జీవితం ఉన్నతంగా ఉంటుందని, ర్యాగింగ్ వంటి చెడు మార్గంలో వెళితే జీవితం సర్వనాశనం అవుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి అన్నారు. కేఎంసీలో ర్యాగింగ్‌పై పత్రికల్లో వచ్చిన కథ నాలపై స్పందించారు. గురువారం కాలేజీకి వెళ్లి ప్రిన్సిపాల్ డా.కే.చిట్టినరసమ్మ, వైస్ ప్రిన్సిపాల్ డా.సాయి సుధీర్, త్రీటౌన్ ఎస్‌ఐ మన్మథ విజయ్‌తో కలిసి ఘటన ఎప్పుడు, ఎలా జరిగిందో ఎవరు చేశారో వైద్యులను విచారించారు. అనంతరం అనాటమి హాలులో మొదటి సంవత్సరం విద్యార్థుల దగ్గరకు వెళ్లి ర్యాగింగ్‌పై జరిగిన ఘటన గురించి మాట్లాడారు. ర్యాగింగ్ వల్ల ఎవరికైనా ఇబ్బంది కలిగితే జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలన్నారు. అనంతరం న్యూలెక్చరర్ హాల్‌లో సీనియర్ విద్యార్థులను ఉద్దేశించి న్యాయాధి కారి మాట్లాడారు. ర్యాగింగ్‌కు పాల్పడినా, ప్రోత్సహించిన వారికి శిక్షలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు.

ఆగిన పెళ్లి తంతు

- ముహూర్తం సమయానికి కనిపించని వధువు
- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన తండ్రి

పత్తికొండ, అక్టోబరు 24: కొన్ని గంటల వ్యవధిలో జరగాల్సిన పెళ్లి తంతు ఆగిపోయింది. ముహూర్తం సమయానికి పెళ్లి కూతురు కనిపించకపోవడమే ఇందుకు కారణం. అనంతపురం పట్టణానికి చెందిన నరేంద్రకుమార్ కూతురు వైష్ణవికి క్రిష్ణగిరి మండలం లక్కసాగరం గ్రామానికి చెందిన బజారి కుమారుడు విశ్వాస్‌కు గురువారం వివాహం నిశ్చయమైంది. పత్తికొండ పట్టణంలోని గోపాల్‌ప్లాజాలో పెళ్లికి ఏర్పాట్లు చేసుకున్నారు. ఇరువైపుల బంధువులు బుధవారం రాత్రి గోపాల్‌ప్లాజాకు చేరుకున్నారు. రాత్రి పెద్దతాంబూలం కార్యక్రమాలు పూర్తి చేశారు. ఉదయం పెళ్లి తంతు నిర్వహణకు సిద్ధం అవుతుండగా పెళ్లి కూతురు కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల వెదికినా ఆచూకీ దొరకలేదు. కూతురు కనిపించకపోవడంతో కన్నీటిపర్యంతమైన తండ్రి పత్తికొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా తెల్లవారు జామున 4 గంటల సమయంలో యువతి వెళ్తుండగా సీసీ కెమెరాలో నమోదైంది. యువతి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ జయన్న తెలిపారు.

ఉచిత బస్సు హామీని అమలు చేయాలి



జాతీయ రహదారిపై నిరసన వ్యక్తం తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

నంద్యాల క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీని అమలు చేయాలని ఏఐసీసీ మెంబర్, నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహయాదవ్ డిమాండ్ చేశారు. గురువారం నంద్యాలలోని నూనెపల్లె సెంటర్‌లో కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారిపై కాంగ్రెస్ నాయకులు ప్లకార్డులు చేపట్టి నిరసన తెలిపారు. నంద్యాల నుంచి కంబలూరుకు వెళ్లే పల్లె వెలుగు బస్సులో మహిళలతో మాట్లాడుతూ పోస్ట్‌కార్డ్ ఉద్యమాన్ని చేపట్టారు. సూపర్ సిక్స్‌లో భాగంగా రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ప్రతి ఇంటికి ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, మహాలక్ష్మి పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. పట్టణ మాజీ అధ్యక్షుడు చింతలయ్య, సేవాదళ్ మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి, మాజీ ఉపాధ్యక్షుడు ఉసేన్‌బాషా పాల్గొన్నారు.

సీడ్స్ కంపెనీకి మొట్టికాయ

కర్నూలు లీగల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రైతుకు నాసిరకం విత్తనాలు అమ్మి సేవాలోపం చేసిన సీడ్స్ కంపెనీకి జిల్లా వినియోగదారుల కమిషన్ తగిన రీతిలో మొట్టికాయ వేసింది. ఓర్వకల్లు మండలం తడకనపల్లె గ్రామానికి చెందిన రైతు జి.రమేష్ కర్నూలు చెందిన మహాలక్ష్మి సీడ్స్ దుకాణంలో మహారాష్ట్రకు చెందిన అక్షయ సీడ్స్ కంపెనీకి చెందిన దివ్య రకం క్యాబేజీ విత్తనాలను 2019 మార్చిలో కొనుగోలు చేశారు. పొలంలో విత్తనాలను విత్తి తగిన జాగ్రత్తలు తీసుకుని పంట సాగు చేశారు. అయినా కూడా రైతుకు పంట నష్టం జరిగింది. దీంతో రైతు జిల్లా వ్యవసాయాశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ అధికారులు పంటను పరిశీలించి విత్తన లోపంతోనే రైతుకు నష్టం జరిగిందని విచారించారు. కేసును విచారించి రైతుకు నష్టపరిహారాన్ని చెల్లించాలని ఆదేశిస్తూ జిల్లా వినియోగ దారుల కమిషన్ చైర్మన్ కరణం కిషోర్ కుమార్, సభ్యులు ఎన్.నారాయణ రెడ్డి, నజీమా కౌసర్ గురువారం ఆదేశాలు జారీ చేశారు.

జీజీహెచ్‌లో టీబీ ముక్త్ భారత్ బృందం పర్యటన



సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న డాక్టర్ నీరద

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో టీబీ ముక్త్ భారత్ బృందం గురువారం ఉదయం పర్యటించింది. ఆసుపత్రిలోని న్యూడయోగ్నస్టిక్ బ్లాక్‌తోపాటు ఊపిరితిత్తుల వార్డు ఇతర విభాగాలను టీబీ ముక్త్‌భారత్ ఆఫీసర్ డాక్టర్ నీరద పరిశీలించారు. ఆసుపత్రిలో వైద్యసిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలు, క్రిమిసంహారక, స్టెరిలైజేషన్ పర్యావరణ సంక్రమణ నియంత్రణ, చేతి పరిశుభ్రమైన ఐజే లోషన్ జాగ్రత్తలను వివరించారు. అంటు వ్యాధుల నివారణలో వైద్య సిబ్బంది పాత్ర కీలకమైనదని జీజీహెచ్ సూపరింటెండెంట్ సి.ప్రభాకర్ రెడ్డికి వివరించారు. డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్లు శివబాల, కిరణ్ కుమార్, న్యూడయోగ్నస్టిక్ బ్లాక్ ఇన్‌చార్జి సునీల్ ప్రశాంత్, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రీబాయి, ఐసీఎన్‌లు సంపత్, హర్షద్ పాల్గొన్నారు.

రూపురేఖలు మారనున్న ఫార్మసీ విభాగం:
ఫార్మసీ విభాగానికి త్వరలో రూపురేఖలు మార్చనున్నట్లు సూపరింటెండెంట్ సి.ప్రభాకర్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన ఆసుపత్రిలో ఉదయం రౌండ్స్ నిర్వహించారు. న్యూరో సర్జరీలో టైల్స్ మరమ్మతులు చేయాలన్నారు. మార్చురి వద్ద డ్రైనేజీ పనులను పరిశీలించారు. క్యాన్సర్ హాస్పిటల్ రోడ్డు సమీపంలో ఉన్న డంప్‌యాడ్ దగ్గర ఉన్న వెస్టేజ్‌ను తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు.

ఈవ్‌టీజింగ్‌పై స్పెషల్ డ్రైవ్

కర్నూలు క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నగరం లో ఈవ్‌టీజింగ్‌పై పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సీసీఎస్ సీఐలు ప్రవీణ్ కుమార్, పార్థసారథిరెడ్డి, లక్ష్మయ్య, మారుతి శంకర్ ఆధ్వర్యంలో ఇద్దరు సివిల్ కానిస్టే బుళ్లు, ఒక ట్రాఫిక్ కానిస్టేబుళ్ల ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. గాయత్రి ఎస్టేట్, రాజ్‌విహార్, కేవీఆర్ కాలేజీ, బళ్లారి చౌరస్తా, ఆర్టీసీ బస్టాండు సమీపంలో కళాశాలల వద్ద సాయం త్రం నుంచి రాత్రిదాకా నిఘా ఏర్పాటు చేశారు. ఇటీవల కళా శాలల వద్ద ఈవ్‌టీజింగ్ జరుగుతుందన్న ఫిర్యాదుల నేపథ్యంలో పోలీసులు ఈ చర్యలు తీసుకున్నారు.

జిల్లాలో త్వరలో క్యాన్సర్ స్క్రీనింగ్



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో భాస్కర్

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నట్లు 3.0 క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులను జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డా.ఎల్. భాస్కర్ తెలిపారు. కర్నూలు మెడికల్ కాలేజీ డా.బీసా రాయ్ మీటింగ్ హాలులో క్యాన్సర్ స్క్రీనింగ్ శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బీపీ షుగర్‌తోపాటు క్యాన్సర్ స్క్రీనింగ్‌కు 18 సంవత్సరాలు పైబడిన స్త్రీ, పురుషులను పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీలు, స్టాఫ్‌నర్సులు సర్వే చేసి గుర్తించాలని ఆదేశిం చారు. పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ఎఫ్‌బీడీ కార్యక్రమా నికి రెఫర్ చేసి తర్వాత పరీక్షలు నిర్వహించి చికిత్స అందిస్తారన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే అధికారిణి హేమలత, ట్రైనింగ్ రిసోర్స్ పర్సన్ డా.మంజూష, గైనకాలజిస్టు డా.సాహిత్య జయరామ్, డెంటిస్టు ఆదర్శ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి



చెట్టును ఢీ కొన్న వాహనం

- ఒకరికి గాయాలు

గూడూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. ఒకరికి గాయాలయ్యాయి. కె.నాగలాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం బొలేరో వాహనం చెట్టును ఢీ కోనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఎమ్మిగనూరు నుంచి కర్నూలు వైపు వెళ్తున్న బొలేరో వాహనం డ్రైవర్ నిర్లక్షంగా కారణంగా వచ్చి చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో బొలేరో వాహనంలో ఉన్న రామయ్య(43), గురప్ప(32)లు అక్కడి కక్కడే మృతి చెందారు. డ్రైవర్ వెంకటయ్యరే గాయాలు కావడతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్‌ఐ ఆశ లత సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆటో, బైక్ ఢీ.. ఒకరి మృతి

దొర్నిపాడు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎనిమిదిగాండ్ల మోరి వద్ద ఆటో, బైక్ ఢీకొని ఒకరు మృతి చెందారు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. గురువారం దొర్నిపాడు నుంచి కోవెలకుంట్లకు వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డుపై ఆటో, బైక్ ఢీకొనడంతో ఆళ్లగడ్డ మండలం ఓబుళంపల్లెకు చెందిన గైబుసా, నాగిరెడ్డి పల్లెకు చెందిన కృష్ణారెడ్డిలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం గైబుసాను నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ గైబుసా (50) మృతి చెందినట్లు ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.



చికిత్స పొందుతున్న కృష్ణారెడ్డి

ఉరివేసుకొని ఆత్మహత్య

అవుకు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అవుకు మండలం ఇస్రానాయక్‌తండాకు చెందిన అంజనేయ నాయక్ (28) అనే వ్యక్తి ఇంట్లోనే ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తాగుడుకు బానిస కావడంతో కుటుంబంలో కలహాలు పెరిగాయి. దీంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లోనే ఉరివేసుకొని మృతి చెందాడు. మృతునికి భార్య లళితబాయి, కూతురు, కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజారెడ్డి తెలిపారు.

నూర్పిడి యంత్రంలో పడి వ్యక్తి మృతి



మహమ్మద్ (ఫైల్)

సంజామల, అక్టోబరు 24: ముదిగేడు గ్రామానికి చెందిన పసుపల పెద్ద అలీఖాన్ (58) ప్రమాదవశాత్తు నూర్పిడి యంత్రంలో పడి మృతి చెందాడు. ముదిగేడుకు చెందిన చవ్వా సూర్యుడు తన ట్రాక్టర్ మిషన్‌కు మినుము పంట నూర్పిడి చేయడానికి రావాలని గురువారం సాయంత్రం పిలిచాడు. దీంతో అలీఖాన్ కూలీలతో కలిసి పనికి వెళ్లాడు ట్రాక్టర్ నూర్పిడి యంత్రంపై నిలబడి మినుమును అందులో వేస్తుండగా ప్రమాదశాత్తు యంత్రంలో పడి తునాతునకల య్యాడు. విషయం తెలుసుకున్న సోదరుడు పసుపల మహమ్మద్ మృత దేహాన్ని గృహానికి చేర్చి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

డోన్ రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లెంపల్లె గ్రామ సమీపంలో చెరువ ుకుంటలో గల్లంతయిన వ్యక్తి మృతదేహం గురువారం లభ్యమైంది. డోన్ మండలం మల్లెంపల్లె గ్రామానికి చెందిన మాదన్న (51) రెండు రోజుల కిందట బైక్‌పై వెళ్తూ ప్రమాదవశాత్తు చెరువు కుంటలో పడి గల్లంత య్యాడు. రెండు రోజుల తర్వాత మృతదేహం బయట పడటంతో గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు. మృతునికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు.



నంద్యాల ప్రభుత్వాసుపత్రికి ఎదురుగా రోడ్డుపైన పడి ఉన్న రోగి

ఫుట్‌పాత్‌పైన రోగి

- సమాచారం ఇచ్చినా పట్టించుకోని ఆస్పత్రి సిబ్బంది

నంద్యాల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఫుట్‌పాత్‌పై పడి ఉన్న రోగి గురించి నంద్యాల సర్వజన ప్రభుత్వాసుపత్రి సిబ్బందికి సమాచారం ఇచ్చినా పట్టించుకోలేదు. తీవ్ర అస్వస్థతతో ఓ రోగి కొద్ది రోజుల క్రితం ఆస్పత్రిలో చేరగా వైద్యులు చికిత్స అందించి ఆ రోగిని పురుషుల వార్డులో ఉంచారు. ఆ రోగి బయటకు వచ్చి తిరిగి వెళ్లేందుకు ఓపిక లేక ప్రభుత్వాసుపత్రికి ఎదురుగా ఉన్న ఫుట్‌పాత్‌పై పడిపోయాడు. ఈ విషయాన్ని ఆస్పత్రి సిబ్బందికి తెలియజేయగా మధ్యాహ్నం నుంచి కనపడటం లేదని పేషెంట్ షీట్‌లో రాసుకున్నామని చెప్పారు. ఫలానా చోట పడి ఉన్నాడని చెప్పినా ఆస్పత్రిలో ఉన్నంత వరకే తమ బాధ్యత అని నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందిస్తున్న శివరామయ్య కుటుంబ సభ్యులు

గోనెగండ్ల, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దనేలటూరు గ్రామంలో నిర్మిస్తున్న ఈశ్వర దేవాలయ నిర్మాణానికి భక్తులు గురువారం విరాళాలు అందజేశారు. గ్రామానికి చెందిన బోయ హనుమంతునాయుడు రూ.లక్ష, శివరామయ్య ఆచారి తరపున కుటుంబ సభ్యులు రూ.లక్ష దేవాలయ కమిటీ సభ్యులకు అందజేశారు. అనంతరం కమిటీ సభ్యులు దాతలను శాలువాలతో సన్మానించారు. శిల్పి శ్రీనివాసులు, వీరన్నగౌడ్, చంద్రశేఖర్, రామచంద్ర, నీలకంఠ, తిప్పన్నగౌడ్, పార్లపల్లి సోమన్న, వెంకట్రాముడు, ప్రతాప్, శంకర్, పరమేష్, విరూపాక్షి, గోపాల్ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



హనుమంతు కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

సమస్యల పరిష్కారానికే ప్రజా వేదిక


ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి

సి.బెళగల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికే ప్రజా వేదిక కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. సి.బెళగల్ మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో ఎంపీపీ బొంతల మునెప్ప అధ్యక్షతన గురువారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఎమ్మెల్యే దస్తగిరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన రెవెన్యూ సమస్యలు, తాగునీరు, సీసీరోడ్లు, ఇళ్లు, పింఛన్లు తదితర సమస్యలపై ఎమ్మెల్యే ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు కొత్తకోట హరి, అమర్, డాక్టర్ తిమ్మప్ప, మాజీ మండల కన్వీనర్ పాండురంగన్న గౌడు, ధనుంజయుడు, బాలజీ వెంకటేష్, పౌలు, భాస్కర్, ఎంపీటీసీ రవికుమార్, శంకర్, గోవిందు, డిస్ వెంకటేశ్వర్లు, మాజీ జడ్పీటీసీ చంద్రశేఖర్, మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆ ర్వోలు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రి తనిఖీ


వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

కోడుమూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని కలెక్టర్ రంజిత్‌బాషా గురువారం తనిఖీ చేశారు. రోజుకు ఎంత మంది రోగులు ఆసుపత్రిని ఆశ్రయిస్తారని, వాళ్లను వైద్యం ఎలా అందిస్తున్నారని డాక్టర్ నాగరాజును అడిగి తెలుసుకున్నారు. ఇందుకు డాక్టర్ నాగరాజు సమాధానం ఇస్తూ ఇక్కడికి కోడుమూరు, గోనెగండ్ల, క్రిష్ణగిరి, దేవనకొండ, గూడూరు, సి.బెళగల్ మండలాల నుంచి రోజుకు 500 మంది వరకు ఆసుపత్రికి వస్తుంటారని చెప్పారు. మందుల పంపిణీ, ఆసుపత్రిలోని సౌకర్యాలు, రోగులు పడుతున్న ఇబ్బందులను గురించి కూడా కలెక్టర్ ఆరా తీశారు. వార్డుల్లోని రోగులను నేరుగా కలిసి వైద్యం సేవల గురించి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని కోరారు. కలెక్టర్ వెంట ఎంపీడీవో రాముడు, డిప్యూటీ తహసీల్దార్ రామాంజనేయులు, మండల ఇంజనీర్ గంగరాజు వీఆర్వో ఎల్లప్ప, పరమేష్ ఉన్నారు.

గృహ నిర్మాణాలను పూర్తి చేయాలి


మాట్లాడుతున్న ఆర్డీవో సందీప్ కుమార్

గూడూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): గూడూరు నగర పంచాయతీ పరిధిలో గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్డీవో సందీప్ కుమార్ అన్నారు. గురువారం గూడూరు నగర పంచాయతీ కార్యాలయంలో గృహ నిర్మాణాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ గూడూరు నగర పంచాయతీ పరిధిలో 920 గృహాలకు గాను 801 గృహాలు పూర్తి కాగా, మిగిలిన 119 గృహాలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో హౌసింగ్ ఈఈ ఎఎల్ ప్రభాకర్, డీఈ వాసుదేవరావు, ఏఈ జమన్న, వర్క్ ఇన్‌స్పెక్టర్ లక్షణ్‌రావు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

కర్నూలు క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో శ్రీరామ్‌నగర్‌లో ప్రమీలమ్మ (53) అనే మహిళ ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె భర్త ఎమ్మిగనూరు ఆర్టీసీ డిపోలో మెకానిక్‌గా పని చేస్తున్నాడు. ఆమెకు ఇద్దరు సంతానం. ఈమె కొద్ది కాలంగా షుగర్, బీపీ వ్యాధులతో బాధపడుతోంది. దీంతోపాటు కొడుకు కూడా జీవితంలో స్థిరపడకుండా చిల్లరగా తిరుగుతుండటంతో మనస్తాపానికి గురైన ఈమె బుధవారం రాత్రి ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. కొడుకు, బంధువులు ఆమెను ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మూలనపడేశారు..

● తుప్పుపడుతున్న పరికరాలు ● పట్టించుకోని అధికారులు

ఓర్వకల్లు, అక్టోబరు 24: రైతుల కోసం సహకార పరపతి సంఘాలకు వ్యవ సాయ పనుల కోసం 2014లో వ్యవసాయ పరికరాలు ఇచ్చారు. అయితే వాటిని వాడుకోకుండా నిరుపయోగంగా మూలన పడేశారు. ట్రాక్టర్లతో పని చేయకపోవడంతో రోజురోజుకు తుప్పుపట్టి పాడైపోతున్నాయి. దీంతో ప్రజాధనం దుర్వినియోగం అవుతున్నాయి. మండల కేంద్రమైన ఓర్వకల్లు సహకార పరపతి సంఘానికి, నన్నూరు సహకార పరపతి సంఘానికి ట్రాక్టర్లతో పాటు వ్యవసాయ పరికరాలు కూడా ఇచ్చారు. అయితే.. వాటిని సహకార సంఘంలో కంపెనీ ఏర్పాటు చేసి రైతుల పొలాలకు తక్కువ రేటుతో బాడుగకు ఇవ్వాలి. ఏడాదిపాటు సహకార సంఘం వారు ట్రాక్టర్లను రైతులకు బాడుగ ఇచ్చారు. ఆ తర్వాత ఏమైందో గానీ సహకార సంఘం వెనుక ప్రాంతాల్లో వాటిని నిరుపయోగంగా వదిలేశారు. వాటిని పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ట్రాక్టర్లను సహకార సంఘం వారికి కాకుండా ప్రైవేటు వ్యక్తులకు బాడుగ ఇస్తే.. సంఘానికి ఆదాయం వస్తుందని రైతులు అంటున్నారు.


నన్నూరు సొసైటీలో మూలనపడ్డ ట్రాక్టర్ ఇంజన్


ఓర్వకల్లు సొసైటీలో నిరుపయోగంగా ఉన్న వ్యవసాయ పనిముట్లు

ప్రజాధనం దుర్వినియోగం



సహకార సంఘానికి ప్రభుత్వం రెండు ట్రాక్టర్లను, వ్యవసాయ పరిక రాలను మంజూరు చేసింది. అయితే అది నిరుపయోగంగా మారాయి. అధికారులు స్పందించి యంత్రాలను వినియోగంలోకి తీసుకురావాలి.

\- ప్రతాప్ రెడ్డి, రైతు

కమిటీని ఏర్పాటు చేయండి



సహకార సంఘం ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేసి దాని ద్వారా రైతులకు తక్కువ రేట్లకు వ్యవసాయ పరికరాలను బాడుగకు ఇవ్వాలి. దీంతో రైతులకు ప్రయోజనం కలుగుతోంది.

\- ఆదాంబాషా, రైతు, ఓర్వకల్లు

సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవర్చుకోవాలి: పీడీ

కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవర్చుకోవాలని ఆత్మా ప్రాజెక్టు పీడీ రత్నప్రసాద్ అన్నారు. గురువారం కర్నూలు సబ్ డివిజన్ రైతు సేవా సిబ్బందికి శిక్షణా కార్యక్రమాన్ని ఉద్యాన భవన్ హాలులో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆత్మ డీపీడీ శ్రీలత, ఏడీఏ శాలురెడ్డి, వెంకటేశ్వర్లు, ఏవోడీ శశిధర్ రెడ్డి, కర్నూలు సబ్ డివిజన్ ఏవో దస్తగిరిరెడ్డి, డాక్టర్ రవి, సైంటిస్టు రవికిషోర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కంది, పత్తి పంటలపై వ్యాపిస్తున్న పురు గులు, తెగుళ్లను ఏవిధంగా నివారించవచ్చునో సిబ్బందికి పీడీ అవగాహన కల్పించారు. ఏడీఏ శాలురెడ్డి ఈ-పంట, సామాజిక తనిఖీ గురించి వివరించారు.

నేడు రైతుబజారులో క్లీన్ అండ్ గ్రీన్

కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): నగరంలోని సి.క్యాంపు రైతుబజారులో శుక్రవారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్టేట్ అధి కారి హరీష్ కుమార్, హార్టికల్చర్ ఫీల్డ్ అసిస్టెంట్ శివకుమార్ తెలిపారు. రైతులు, పొదుపు లక్ష్మి మహిళలు కూరగాయలను తీసుకు రావద్దని విజ్ఞప్తి చేశారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ


చెక్కులను పంపిణీ చేస్తున్న గౌరు దంపతులు

కల్లూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయ నిధి కింద ఎంపికైన అర్హులకు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డిలు చెక్కులు పంపిణీ చేశారు. గురువారం మాధవీనగర్‌లోని తన స్వగృహంలో బాధితులకు గౌరు దంపతులు రూ.21,00,00 చెక్కులను అందజేశారు. ఈ మేరకు 26వ వార్డు విఠల్ నగర్ కురువ లక్ష్మన్న, షేక్ అబ్దుల్ సలాంలకు చెక్కులు పంపిణీ చేశారు. పాణ్యం వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, చరణ్ యాదవ్, బీసన్న, శ్రీనివాసులు, సుంకన్న, రవి, సతీష్ పాల్గొన్నారు.

ఆధార్ క్యాంపులను వినియోగించుకోండి

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ ప్రత్యేక క్యాంపులను ప్రజలు వినియోగించుకోవాలని నగర పాలక అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ సూచించారు. గురువారం గౌలిగేరి 129వ సచివాలయంలో ఆధార్ క్యాంపును మేనేజర్‌తో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం 128వ సచివాలయాన్ని తనిఖీ చేశారు.

తడకనపల్లెలో ఆధార్ క్యాంపు

కల్లూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మండలం తడకనపల్లె సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి షేక్షావలి అధ్యక్షతన చేపట్టిన ఆధార్ క్యాంపును టీడీపీ నాయకురాలు, తడకనపల్లె సర్పంచు సహరాబీ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆధార్ క్యాంపును ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. టీడీపీ నాయకులు సుల్తాన్, గ్రామైఖ్య సంఘం అధ్యక్షురాలు జుబేదాబీ, జనసేన నాయకుడు సలాం, ఐటీడీపీ కార్యకర్త ఉశేన్‌బాషా పాల్గొన్నారు.

విజయంతో తిరిగి రండి

కర్నూలు స్పోర్ట్స్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): 68వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్-14 ఫుట్‌బాల్ పోటీలకు కర్నూలు జిల్లా బాలబాలికల జట్లు గురువారం బయలుదేరి వెళ్లాయి. ఈ పోటీలు ఈ నెల 26, 27, 28 తేదీల్లో సత్యసాయి జిల్లా హిందూపూర్‌లో జరగబోయే రాష్ట్ర స్థాయి అండర్-14 ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొంటాయి. ఈ జట్లకు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎన్ గిడ్డయ్య, న్యాయవాది శ్రీధర్ రెడ్డి, సహాయ కార్యదర్శులు కే.పరమేశ్, బి.సుంకారావులు వీడ్కోలు పలికి విజయంతో తిరిగి రావాలని కోరారు.

● **బాలుర జట్టు:** తాయన్న, వినయ్, యశ్వంత్, రేయాన్ ఆలి, ఖలీల్, హరి వెంకట్, వీరేంద్ర, వరుణ్‌గౌడు, హుశేన్‌బాషా, రోహిత్, గౌతమ్ ప్రసాద్, పీటర్, ఎం.కరుణాకర్‌గౌడు, ఎస్.ఖాజా ఫరీద్, ఎస్.అబ్దుల్, టి.తరుణ్, హసీబా.

● **బాలికల జట్టు:** లాస్య, లతిక, శశికళ, వెన్నెల, గీత, అను, లలిత, ప్రవళిక, మానస, నిఖితారెడ్డి, చంద్రిక, బిందుమాధవి, అకిల, ముస్కాన్, అనూష, కళావతి, జరినాబీ, అఖిల.

నాయీబ్రాహ్మణుల హర్షం

కర్నూలు అర్బన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఆలయ కమిటీల్లో నాయీ బ్రాహ్మణులకు చోటు కల్పించినందుకు నాయీ బ్రాహ్మణ సవితా సమాజం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అర్గనైజింగ్ సెక్రటరీ పాలక వీటీ విజయకుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా కూటమీ ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గురువారం టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఆలయాల పాలకవర్గంలో 15 మంది సభ్యుల నుంచి 17 మంది సభ్యులుగా పెంచేలా జీవోను సవరణ చేసి నాయీ బ్రాహ్మణుల నుంచి ఒకరిని, ఆలయ పాలక కమిటీ నామినేటెడ్ చేసేందుకు సీఎం చంద్ర బాబు మంత్రి మండలి నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు.

గొల్లలదొడ్డికి ఆర్టీసీ బస్సు

సి.బెళగల్ అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లలదొడ్డి గ్రామానికి ఆర్టీసీ అధికారులు బస్సు సౌకర్యం కల్పించారు. గురువారం కర్నూలు 2 డిపో నుంచి సి.బెళగల్ మీదుగా గొల్లలదొడ్డి గ్రామానికి చెరుకున్న ఆరీస్టీ బస్సుకు గ్రామస్థులు వేదపండితులచే ప్రత్యేక పూజలు చేయించారు. గ్రామస్థులు ఎమ్మెల్యే దస్తగిరి, టీడీపీ సీనియర్ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి, ఆర్టీసీ అధికా రులకు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు ఖాజ, జగన్‌రెడ్డి, చాంద్ బాషా, ఖాజావలి, తిరుమలరెడ్డి, హనుమంతు, భాస్కరరెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.గకారి, ప్రధాన కార్యదర్శి టీకే జనార్దన్, ఈ.రాముడు, డి.సుధీర్, ఎస్.ముదాసిర్ అహ్మద్‌లు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో డీఈవో శామ్యూల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు పార్థు, మహేష్, వెంకట్రాముడు, నారాయణ పాల్గొన్నారు.

చిన్నకాల్వబుగ్గలో శివుడికి పూజలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఓర్వకల్లు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాల్వబుగ్గ గ్రామ సమీపాన ఉన్న చిన్నకాల్వబుగ్గ రామేశ్వరుడి ఆలయంలో స్వామి వారికి 'ధూపదీపం కరువు' అనే శీర్షిక ఈనెల 21న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. స్పందించిన ఈవో మద్దిలేటి ఆలయ ప్రాంగణం శుభ్ర పరచి ఆలయంలో ఉన్న శివలింగానికి అర్చకుడితో ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా ఈవో మద్దిలేటి మాట్లాడుతూ ప్రతి రోజు చిన్న బుగ్గ రామేశ్వరుని ఆలయంలో పూజలు నిర్వహిస్తామని, భక్తులు స్వామివారిని దర్శించుకోవాలన్నారు. ఈసందర్భంగా హుశేనాపురం, కాల్వ, కాల్వబుగ్గ భక్తులు, ప్రజలు ఆంధ్రజ్యోతికి ధన్యవాదాలు తెలిపారు.

నీటిని ఎందుకు నిల్వ చేయడం లేదు

ఇరిగేషన్ అధికారులను నిలదీసిన జడ్పీటీసీ సభ్యుడు


అధికారులను నిలదీస్తున్న జడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి

కోడుమూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): గాజులదిన్నె ప్రాజెక్టులో నీటిని ఎందుకు నిల్వ చేయడం లేదని ఎల్లెల్సీ డీఈఈ సుబ్బరాయుడు, జీడీపీ కుడి కాల్వ ఏఈ నారాయణను జడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి నిలదీశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో గురువారం ఎంపీపీ రూతమ్మ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తుంగభద్ర నుంచి పెద్ద ఎత్తున నీరు శ్రీశైలం వంటి ప్రాజెక్టులకు నీటిని విడుదల చేస్తున్నారు. వర్షాలు ఎక్కువై నీరంతా సముద్ర పాలు అవుతున్నాయి. ఇలాంటి సమయంలో గాజులదిన్నె ప్రాజెక్టు పూర్తి స్థాయిలో ఎందుకు నింపలేకపోతున్నారని ప్రశ్నించారు. 4.5 టీఎంసీలు ఉండాల్సిన డ్యాంలో కేవలం 2.8 టీఎంసీ నీటిని మాత్రమే ఎందుకు నిల్వ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హంద్రీనీవా నుంచి కుప్పంకు నీరు తీసుకెళ్తున్నారు. ఇక్కడ ఉన్న జీడీపీకి నీటిని తీసుకరావడంలో నీటి పారుదల శాఖ అధికారులు విఫలమయ్యారని విమర్శించారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా రాబోయే రోజుల్లో తాగు, సాగు నీటికి ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాముడు, మండల వ్యవసాయ అధికారి రవిప్రకాష్, మండల ఇంజనీర్ గంగరాజు సర్పంచులు భాగ్యరత్న, శ్రీనివాసరెడ్డి, మధుసూధన్‌రెడ్డి పాల్గొన్నారు.

సూపరింటెండెంట్‌ను కలిసిన నర్సెస్ అసోసియేషన్


సూపరింటెండెంట్‌ను కలిసిన నర్సెస్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం

కర్నూలు హస్పిటల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా గవర్నమెంట్ నర్సెస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం గురువారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసింది. బుధవారం కర్నూలు మెడికల్ కాలేజీలో ఎం.లీలావతి, సి.బంగారి ప్యానెల్ ఆఫీస్ బ్యారర్ల పోస్టులతోపాటు ఈసీ సభ్యులను క్లీన్ స్వీప్ చేసి విజయం సాధించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ అసోసియేషన్ నాయకులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.లీలావతి, సి.బంగారి, కోశాధికారి ఎస్.లక్ష్మీనరసమ్మ, ఎగ్జిక్యూటివ్ సభ్యురాలు ఎస్.సోమేశ్వరి, యూఎం శాంతిలత పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ అసిస్టెంట్లే కీలకం: ఎస్ఈ

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ శాఖలో జరుగుతున్న అభివృద్ధి పనులకు క్షేత్రస్థాయిలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లే కీలకమని పీఆర్ ఎస్ఈ వీ రామచంద్రారెడ్డి అన్నారు. కర్నూలు డివిజన్ పరిధిలోని 175 ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు గురువారం జడ్పీ సమావేశ భవనంలో రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. క్వాలిటీ కంట్రోల్ డీఈ రవీంద్రారెడ్డి, ఏఈ విజయభాస్కర్‌లు ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు రోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు ఎలా పాటించాలో అవ గాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ ఒక్కో గ్రామానికి రూ.10 నుంచి రూ.20 లక్షల వరకు నిధులు మంజూరయ్యాయని, ఇప్పటికే టెండరు ప్రక్రియ పూర్తి అయిందని అన్నారు. కార్యక్రమంలో డీఈఈలు నాగిరెడ్డి, మహేశ్వరరెడ్డి, రమేష్‌కుమార్‌రెడ్డి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగనిరింజన్, మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

ర్యాగింగ్ జోలికి వెళ్లొద్దు

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ర్యాగింగ్ జోలికి వెళ్లి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్‌ఐ మమత సూచించారు. గురువారం బి.క్యాంపు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ర్యాగింగ్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమములో ఎస్‌ఐ నరేంద్ర, ప్రిన్సిపాల్ శీలా సౌజన్య బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

కర్నూలు అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): యువత తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాలని కర్నూలు నియోజకవర్గం ఆర్వో, నగర పాలక సంస్థ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అన్నారు. గురువారం కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో స్వీప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటును నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ లాలప్ప, డిప్యూటీ తహసీల్దార్ ధనుంజయ్, అధ్యాపకులు నాగిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

చట్టం దృష్టిలో అందరూ సమానమే : సీఐ

సి.బెళగల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): చట్టం దృష్టిలో అందరూ సమానమేనని కోడుమూరు సీఐ తబ్రేజ్ అన్నారు. గత వారంలో హమాలీల డబ్బుల పంపిణీ విషయంలో ఘర్షణ పడ్డవారిని ఇళ్లకు గురువారం సీఐ వెళ్లి విచారించారు. అనంతరం సీఐ గ్రామస్థులతో మాట్లాడుతూ సమస్యలు ఏమైనా ఉంటే ప్రజలు తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సీఐ వెంట ఎస్‌ఐ తిమ్మారెడ్డి, పోలీసులు ఉన్నారు.

సమస్యలపై పోరాటాలకు సిద్ధం కండి

కల్లూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం న్యూసిటీ కార్యవర్గ సభ్యుడు కె.సుధాకరప్ప, సీహెచ్. సాయిబాబా ఆటో కార్మికులకు పిలుపునిచ్చారు. గురువారం 32వ వార్డులోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన ఆటో కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శంకర్, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు జీజీహెచ్‌లో అన్న క్యాంటీన్ ప్రారంభం

కర్నూలు హస్పిటల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను శుక్రవారం ఉదయం 8.30 గంటలకు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ ప్రారంభించనున్నారు. కలెక్టర్ పి.రంజిత్ బాషా, మేయర్ బీవై రామయ్య, కమిషనర్ రవీంద్రబాబు, కర్నూలు జీజీ హెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్ రెడ్డి పాల్గొంటారు.

మృతదేహానికి అంత్యక్రియలు

కర్నూలు క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ రైలులో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన వృద్ధుడి మృతదేహానికి గురువారం పోలీసులు అంత్యక్రియలు నిర్వహించారు. మూడు రోజుల క్రితం రైలు బోగిలో టాయిలెట్‌లో మృతి చెంది కనిపించాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు మృతదేహాన్ని మార్చురికి తరలించారు. మూడు రోజులుగా ఆచూకీ లభించకపోవడంతో రైల్వే పోలీసులే అంత్యక్రియలు నిర్వహించారు.

జనవాణికి స్పందన

కర్నూలు(రాజ్‌విహార్ సర్కిల్), అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ నిర్వహించిన జనవాణి కార్యక్రమానికి స్పందన లభించింది. గురువారం మంగళగిరిలోని కేంద్ర కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా, రాష్ట్రం నలు మూలాల నుంచి పెద్ద ఎత్తున బాధితులు పాల్గొని సమస్యలను విన్నవించారు. భూ వివాదాలు, పలు ప్రభుత్వ కార్యాలయాల్లో అపరిష్కృతంగా ఉన్న సమస్యలు రాజోలు శాసనసభ్యుడు దేవ వరప్రసాద్‌తో పాటు పార్టీ నేతలకు నివేదించారు. కార్యక్రమంలో జిల్లా నుంచి చింతా సురేష్, పీటీపీ సుబ్బయ్య పాల్గొన్నారు.


అర్జీలు స్వీకరిస్తున్న జనసేన నాయకులు

సమయ పాలన పాటించాలి

• జడ్పీ డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి



జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవోను సన్మానిస్తున్న అధికారులు

వెల్దుర్తి, అక్టోబరు (ఆంధ్రజ్యోతి)24: అధికారులు, సిబ్బంది సమయ పాలన పాటించాలని జడ్పీ డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి సూచించారు. గురువారం మండల ప్రజాపరిషత్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ప్రజా సమస్యలను పరిష్కరించ డంలో నిర్లక్ష్యాన్ని వీడాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. అనంతరం జడ్పీ సీఈవోను సిబ్బంది సన్మానించారు. ఎంపీడీవో సుహాసినమ్మ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాం

తుగ్గలి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజా, కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తామని సీపీఎం కార్యదర్శి శ్రీరాములు అన్నారు. గురువారం మారెళ్లలో సీపీఎం కార్యదర్శిగా రంగస్వామిని ఎన్నుకున్నారు. సీపీఎం ఉద్యమాలు చేసి ప్రజలకు న్యాయం చేసేలా సీపీఎం పోరాడుతుందని అన్నారు. రంగరాజు, రాంపల్లి శ్రీను ఉన్నారు.

ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు

• ట్రైనీ డీఎస్పీ ఉషశ్రీ

ఆస్పరి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎక్కడా ఇసుక రీచ్‌లు లేవని, అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ట్రైనీ డీఎస్పీ ఉషశ్రీ హెచ్చరించారు. వంకలు, వాగులు, చెరువుల వద్ద ఇసుక తవ్వకాలు చేయరాదన్నారు. గురువారం ఆమె విధుల్లో చేరారు. రెండు నెలలపాటు తాను స్టేషన్ ఆఫీసర్‌గా విధులు నిర్వ హించ నున్నట్లు ఆమె తెలిపారు. అనంతరం స్టేషన్లో రికార్డులను పరిశీలించి, పోలీసుశాఖలో తీసుకున్న నూతన విధా నాలను సిబ్బందికి వివరించారు. కలెక్టరు కార్యాలయంలో టోల్ ఫ్రీ నెంబరు 18004256042 ప్రజలు వినియోగిం చుకోవాలని సూచించారు. ప్రజలకు ఇసుక కావాలంటే రెవెన్యూ, గ్రామపంచాయతీ అధికారులను సంప్రదించాలని కోరారు. సీఐ మస్తాన్‌వలి, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ట్రైనీ డీఎస్పీ ఉషశ్రీ



రోగులను కర్నూలుకు పంపుతున్న నాయకులు

కళ్లను కాపాడుకోవాలి

తుగ్గలి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కళ్లను ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా కాపాడుకోవాలని టీడీపీ సీనియర్ నాయకులు వెంకటస్వామి సూచించారు. గురువారం మండలంలోని జి.ఎర్రగుడిలో అమీలియో వైద్యశాల ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించి దాదాపు 30 మందిని శస్త్ర చికిత్సల కోసం బస్సులో కర్నూలుకు తరలించేందుకు బస్సుకు జెండా ఊపి టీడీపీ నాయకులు ప్రారంభించారు. పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు సహకారంతో కంటికి సంబంధించిన వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న వారదరికీ వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారందరికీ కళ్ల అద్దాలు అందించామన్నారు. చికిత్స అవసరమైన వారికి కర్నూలు అమీలియో వైద్యశాలకు తరలించారు. ఎవరైనా కంటి సమస్యలతో బాధపడుతుంటే.. అమీలియో వైద్యశాలకు వెళ్లాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామాంజనేయులు, వైద్యశాల సిబ్బంది వీరసింహ తదితరులు పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం



ర్యాలీని ప్రారంభిస్తున్న రోటరీ క్లబ్ అధ్యక్షుడు సందీప్‌రెడ్డి

ఆదోని అగ్రికల్చర్ 24 (ఆంధ్రజ్యోతి) : పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దామని రోటరీ క్లబ్ అధ్యక్షుడు సందీప్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ప్రపంచ పోలియో దినోత్సవాన్ని పురస్కరించుకొని అక్షరశ్రీ, మల్లి కార్జున పాఠశాలల విద్యార్థులతో కలిసి ర్యాలీ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. భారత్‌ను పోలియో రహిత దేశంగా తీర్చిదిద్దడానికి రోటరీ క్లబ్ కృషి మరువలేనిదని అన్నారు. పోలియో నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. 0-5ఏళ్ల పిల్లలకు పోలియో చుక్కలను వేయించాలని సూచించారు. సభ్యులు శ్రీధర్‌రెడ్డి, జీవన్‌సింగ్, సునీల్ రెడ్డి, ప్రశాంత్ గాంధీ, సోమశేఖర్‌రెడ్డి, మేఘనాథ్‌రెడ్డి, సుబ్బయ్య, రాజేష్, పద్మనాభయ్యశెట్టి, హుసేన్ బాష, తదితరులు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న టీడీపీ నాయకులు

అభివృద్ధే టీడీపీ ధ్యేయం

మద్దికెర, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని మాజీ జడ్పీటీసీ పి.పురుషోత్తం చౌదరి, మాజీ ఎంపీటీసీ సుధాకర్ చౌదరి, శివశంకర్ అన్నారు. గురువారం ఎం.అగ్రహారం గ్రామంలో రూ.30లక్షలతో సీసీ రోడ్డు పనులను ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. కూటమి అధికా రంలోకి వచ్చిన మూడు నెలల్లోపు మండలంలో రూ.2 కోట్ల అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు నేతృత్వంలో మండలాన్ని మరింత అభివృద్ధి దిశగా నడిపిస్తామన్నారు. పెరవలి రామాంజులు, రమేష్, ఐ.రాముడు, శంకర్ ఉన్నారు.

రీ సర్వేతో సమస్యలు

వేగం కన్నా ప్రాణం మిన్న : సీఐ

ఆదోని రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వేగం కన్నా ప్రాణం మిన్న అని ఆదోని రూరల్ సీఐ నల్లప్ప అన్నారు. గురువారం పెద్దతుంబళం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రహదారి భద్రతపై సమావేశం ఏర్పాటు చేశారు. డ్రైవర్లు ప్రయాణీకులను సురక్షితంగా గమ్య స్థానానికి చేర్చాలన్నారు. వేగ నియంత్రణ లేకుంటే పమాదాలు జరిగి కుటుంబాలు చిన్నాభిన్నమవు తాయని సూచించారు. విద్యార్థులు దురాలవాట్లకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. పెద్దతుంబళం ఎస్.ఐ మహేష్ కుమార్, హెచ్ఎం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రీ సర్వేతో సమస్యలు

ఆదోని రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రీ సర్వేతో తమ భూముల విస్తీర్ణంలో సమస్యలు వచ్చాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఆదోని మండలం సాంబగల్లు గ్రామంలో రెవెన్యూ అధికారులు గ్రామ సభలు నిర్వహించారు. 37 మంది రైతులు అధికారులకు వినతి పత్రం అందజేశారు. తమ భూమి రీ సర్వే చేసిన తరువాత తక్కువ చూపిస్తుందని కొందరు, జాయింట్ ఎల్‌పీఎంతో తమకు ఇబ్బందులు కలుగుతుందని మరికొందరు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ పెద్దయ్య, సర్వేయర్ ఈశ్వర్ ప్రసన్న కుమార్ పాల్గొన్నారు.

రీ సర్వే సమస్యల పరిష్కారం

పత్తికొండ టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం చేయించిన రీ సర్వే సమస్యలను పరిష్కరిస్తామని డీటీ బాలు నాయక్ అన్నారు. గురువారం మండల పరిధిలోని పెద్దహుల్తి గ్రామంలో రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. రీసర్వే సమస్యలు ఉంటే రైతులు తమ దృష్టికి తీసుకురావాలని వాటిని పరిష్కరిస్తామన్నారు. సర్వేయర్ గాదెలింగప్ప, భీరప్ప, వీఆర్వో రంగస్వామి, రైతులు పాల్గొన్నారు.



రెవెన్యూ సదస్సులో అధికారులు

నేటి నుంచి పశుగణన

మద్దికెర, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో శుక్రవారం నుంచి పశుగణన కార్యక్రమం చేపడుతామని రైతులందరూ సహకరించాలని పశువైద్యాధికారి కృష్ణ నాయక్ తెలిపారు. గురువారం స్థానిక పశువైద్యశాలలో మాట్లాడుతూ మండలంలో మూడు నెలల పాటు పశుగణన ఉంటుందని, రైతులు, ప్రజలు తమ ఇళ్లల్లో పశువులు, ఆవులు, తదితర జంతువుల వివరాలు అందించాలని కోరారు. ఒకవేళ పశు సంపద లేకపోతే ఆ వివరాలు కూడా ఇవ్వాలన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి సర్వే చేయాలని ప్రభుత్వం ఆదేశిం చిందని తెలిపారు. వీధి కుక్కల వివరాలు సైతం సేకరిస్తామని తెలిపారు. రైతులు వివరాలు తెలియజేస్తే ప్రభుత్వ పథకాలు అందుతాయని అన్నారు.

585 దరఖాస్తులు

మద్దికెర, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హంపా, ఎం.అగ్రహారం, బురుజుల గ్రామాల్లో నిర్వహించిన రీసర్వే గ్రామసభలలో 585 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ హుశేన్ సాహేబ్ తెలిపారు. గురువారం వీఆర్వోల సమావేశంలో మాట్లాడుతూ 585 దరఖాస్తులు వచ్చాయనీ, ఆర్ఐ, సర్వేయర్లు విచారణ చేయాలని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తామని తెలిపారు. వీఆర్వోలు రంగస్వామి, రషీద్, శ్రీరాములు ఉన్నారు.

తప్పులను సరిచేస్తాం

తుగ్గలి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రీసర్వేలో జరిగిన తప్పులను సరి చేస్తామని తహసీల్దార్ నాగరాజు అన్నారు. గురువారం తుగ్గలిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో దాదాపు 320 మంది రైతుల నుంచి దరఖాస్తులు వచ్చాయి. సర్వేయర్ సుధాకర్, విలేజ్ సర్వేయర్ రాజేంద్ర తదితరులు ఉన్నారు

జీవితాలను నాశనం చేసుకోవద్దు: డీఎస్పీ


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ

కౌతాళం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఫ్యాక్షన్ జోలికి వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు అన్నారు. గురువారం మండలంలో ఫ్యాక్షన్ గ్రామాలైన నదిచాగి, రౌడూరు గ్రామాలను సందర్శించి పోలీసు పికెట్‌ను పరిశీలించారు. అనంతరం గ్రామస్థులతో మాట్లాడుతూ ఫ్యాక్షన్‌తో జీవితాలు నాశనం కావడంతో పాటు కుటుంబాల జీవితాలు ఛిద్రమవుతున్నాయని గుర్తు చేశారు. పిల్లలను బాగా చదివించుకోవాలని సూచించారు. అలాగే మండల కేంద్రమైన కౌతాళంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో సమావేశమై మత్తు జోలికి పోయి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ఆయన వెంట కౌతాళం సీఐ అశోక్ కుమార్, ఎస్ఐ మహమ్మద్ రిజ్వాన్‌లు ఉన్నారు.

సమాచార హక్కు చట్టాన్ని అమలు చేయాలి

పెద్దకడుబూరు అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని ఫోరం ఫర్ ఆర్టీఐ జిల్లా కార్యదర్శి బొగ్గుల తిక్కన్న, జిల్లా అధ్యక్షుడు పెద్ద యల్లప్ప కోరారు. గురువారం జిల్లా డీఆర్‌వో, డీపీవోలకు వినతిపత్రం అందజేశారు.

రైతుల సమస్యలు పరిష్కరిస్తాం : కలెక్టర్

గోనెగండ్ల, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రీసర్వేలు జరిగిన గ్రామాలలో భూ సమస్యలను పరిష్కరించేందుకే గ్రామ సభలు నిర్వహిస్తున్నామని కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. గురువారం గోనెగండ్ల మండల పరిధిలోని కున్నూరు గ్రామంలో గ్రామసభకు కలెక్టర్ రంజిత్‌బాషా, సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ హాజరయ్యారు. గ్రామసభలో ప్రజల నుంచి వినతులను వారు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం భూ సమస్యలు ఉన్న రైతులు కర్నూలు కలెక్టరేట్‌కు రాకుండా ఆయా గ్రామాలలోనే సమస్యలు పరిష్కరించే విధంగా ఆయా గ్రామాలలో గ్రామ సభలు నిర్వహిస్తున్నామన్నారు. కున్నూరు గ్రామ సర్పంచ్ గ్రామంలో సీసీరోడ్లు, డ్రైనేజీ లేవని వాటికి నిధులు విడుదల చేయాలని కోరగా అందుకు కలెక్టర్ స్పందించి నిధులు విడుదల చేస్తామన్నారు. అనంతరం గ్రామంలోని సచివాలయాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. అక్కడి రికార్డులను పరిశీలించారు. ఎవరు ఏయే విధులు నిర్వహిస్తున్నారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లాకళ్యాణి, సర్వే ఏడీ మునికన్నన్, తహసీల్దార్ కుమారస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలి:
విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని అందించాలని కలెక్టర్ ఆదేశించారు. గురువారం కున్నూరు గ్రామంలోని ఉన్నత పాఠశాలను ఆయన పరిశీలించారు. పాఠశాలలో ఇతర సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను కోరారు.

గూడెంలోనే ఉల్లి పంటను అమ్ముతాం - కలెక్టర్ ముందు ఉల్లి రైతుల గోడు
దూరమైన సరే మేము పండించిన ఉల్లి పంటను తాడేపల్లిగూడెంలోనే అమ్ముతాము కాని కర్నూలులో అమ్మము అని కున్నూరు గ్రామ ఉల్లి రైతులు కలెక్టర్ రంజిత్ బాషాతో అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా కున్నూరుకు వచ్చారు. అనంతరం గ్రామ శివార్లలో ఉల్లి పంటను ఆరబోసుకొని గ్రేడింగ్ చేస్తున్న ఉల్లి రైతుల దగ్గరకు వచ్చి వారి సమస్యలను అడిగారు. ఉల్లి పంట గిట్టుబాటు అవుతుందా.. లేదా.. ఎకరానికి ఎంత పెట్టుబడి వస్తుంది. పండిన పంటను ఎక్కడి అమ్ముతారు అని ఉల్లి రైతులను కలెక్టర్ ప్రశ్నించారు. దీంతో ఉల్లి రైతులు ప్రస్తుతం గిట్టుబాటుధర ఉంది. కార్యక్రమంలో ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, ఏవో హేమలత, సిబ్బంది పాల్గొన్నారు.


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

మహిళా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

● టీడీపీ మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మహిళా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌చార్జి ఎస్.రాఘవేంద్రరెడ్డి అన్నారు. గురువారం తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన గ్యారెంటీల్లో ఈనెల 31న ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ నెల 24 నుంచి తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. అర్హత ఉన్న ప్రతి మహిళకు ఏడాదికి మూడు గ్యాస్ కంపెనీల ద్వారా సరఫరా అయ్యేవిధంగా చేస్తారన్నారు. రూ.850లు రాయితీని ప్రతి మహిళ ఖాతాలో జమయ్యే విధంగా ఏర్పాట్లు చేసేందుకు సన్నాహాలు చేశారని తెలిపారు.

రమణీయం రాఘవేంద్రుల స్వర్ణ పల్లకోత్సవం

మంత్రాలయం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలో రాఘవేంద్రుని స్వర్ణ పల్లకోత్సవం రమణీయంగా నిర్వహించారు. రాఘవేంద్రస్వామి మఠంలో రాఘవేంద్రస్వామి సజీవ సమాధి పొందిన కార్తీక గురువారం శుభదినాన్ని పురస్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో మఠం పండితులు, అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాఘవేంద్రస్వామి బృందావన ప్రతిమను స్వర్ణ పల్లకిలో అధిష్ఠించి రమణీయంగా ఊరేగించారు. వేద పండితుల మంత్రోచ్చారణలు మంగళవాయిద్యాలు మధ్య శ్రీమఠం ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. అనంతరం ఊంజల సేవ చేశారు.


స్వర్ణ పల్లకిలో ఊరేగుతున్న రాఘవేంద్రులు

మంత్రాలయంలో పోటెత్తిన భక్తులు: రాఘవేంద్ర స్వామి దర్శనార్థం భక్తులు పోటెత్తారు. బుధవారం సాయంత్రం నుంచి భక్తుల తాకిడి పెరిగింది. రాఘవేంద్ర స్వామికి ఇష్టమైన దినం గురువారం కావటంతో ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు తరలి వచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖ ద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, నదితీరం భక్తులతో కోలాహలంగా మారింది. గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. క్యూలైన్‌స్లు, పరిమళ ప్రసాదం వద్ద భక్తుల సందడిగా మారింది. శ్రీ మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్ వెంకటేష్ జోషి పరిమళ ప్రసాదం కొరత రానీయకుండా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. రథోత్సవాల ఊరేగింపులో పాల్గొని, భక్తులు పీఠాధిపతులు సుబుధేంద్ర తీర్థుల ఆశీస్సులు పొందారు.

అలరించిన భరతనాట్యం

మంత్రాలయం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి సన్నిధానంలో కార్తీక మాసం గురువారం పురస్కరించుకుని బెంగళూరు చెందిన మారికాంబ నృత్య కళాకేంద్రం నిర్వహకులచే నిర్వహించిన భరత నాట్యం భక్తులను అలరించింది. గురువారం ప్రవచనా మండపంలో నృత్య నిర్వాహకులు స్మిత ప్రకాష్ ఆధ్వర్యంలో దాదాపు 30 మంది కళాకారులు భరత నాట్యం, కూచిపూడి ప్రదర్శనలు భక్తుల ను కనువిందు చేసింది. కళానృత్యాలను మెచ్చిన పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు కళాకారులకు శేషవస్త్రం, ఫలపుష్ప మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమంలో శ్రీపతాచార్, వెంకటేశ్ జోషీ, డీఎం ఆనందరావు, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, పద్మనాభాచార్, హనుమేషాచార్ పాల్గొన్నారు.

శ్రీమఠం అన్నదానానికి విరాళం:
రాఘవేంద్రస్వామి మఠానికి హైదరాబాద్‌కు చెందిన నీరజ రమేష్ అనే భక్తురాలు రూ. లక్ష అన్నదానానికి విరాళంగా ఇచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజరు వెంకటేష్ జోషి తెలిపారు. గురువారం కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని రూ.లక్ష నగదును విరాళం ఇచ్చినట్లు తెలిపారు. దాత కుటుంబానికి పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు స్వామివారి మెమెంటో, శేషవస్త్రం, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.

డెంగీపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కులుమాలలో డెంగీ కేసు నమోదు

గోనెగండ్ల, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): డెంగీపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆదోని డివిజన్ మలేరియా అధికారి సాయిబాబా అన్నారు. గురువారం కులుమాల గ్రామంలోని 12 ఏళ్ల పిల్లాడికి డెంగీ సోకడంతో మండల వైద్యాధికారులు గ్రామంలో పర్యటించారు. వీధుల్లో ఉన్న మురుగు నీటిని తొలగించాలని ఆదేశించారు. గ్రామంలో ఎవరైనా అనారోగ్యం ఉన్నట్లు తెలిస్తే వెంటనే గోనెగండ్ల ప్రభుత్వ అసుపత్రికి రావాలిని వైద్యసిబ్బంది గ్రామస్థులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌వో సుధాకర్, కార్యదర్శి రాందాస్, ఏఎన్ఎంలు, వైద్యసిబ్బంది ఆశా వర్కర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వసతి గృహాల తనిఖీ

ఎమ్మిగనూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నాలుగు ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలను ఆదోని సెకెండ్ అడిషన్ జేఎఫ్‌సీఎం కోర్టు న్యాయాధికారి శ్రీవల్లి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహాల్లో విద్యార్థులకు అందుతున్న వసతులపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట టౌన్ ఎస్ఐ డాక్టర్ నా యక్, కోర్టు సిబ్బంది మహేశ్వరి, కా నిస్టేబుల్ రామాంజనేయులు, న్యాయ వాదులు ఉన్నారు.

బీసీ హాస్టల్..
గోనెగండ్ల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గోనెగండ్లలోని బీసీ బాలిక హాస్టల్‌ను పత్తికొండ న్యాయాధికారి భారతి గురువారం రాత్రి తనిఖీ చేశారు. హాస్టల్ విద్యార్థులతో మాట్లాడారు. ఏఏ సమస్యలు ఉన్నాయని అడిగారు. మంచాలు, ఫ్యాన్‌లు తక్కువగా ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో సీఐ గంగాధర్, సిబ్బంది పాల్గొన్నారు.

మతిస్థిమితంలేని మహిళతో అసభ్య ప్రవర్తన

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.నాగలాపురం గ్రామంలో మతి స్థిమితంలేని ఓ మహిళ పట్ల అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అసభ్యం గా ప్రవర్తించినట్లు గ్రామస్థులు తెలి పారు. దీంతో దేహశుద్ధి చేశాని చెప్పారు. అయితే ఆ వ్యక్తి తనపై కొందరు దాడి చేశారని రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

మున్సిపల్ కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా సహాయ కార్యదర్శి యల్లప్ప, తాలుకా కార్యదర్శులు వీరేష్, తిమ్మ గురుడు డిమాండ్ చేశారు. గురు వారం ఎమ్మిగనూరు మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా చేశారు.